కరెంటు సార్లు.. కనికరించరూ!

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్
స్పందించని ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బంది

రామంతాపూర్ : రామంతాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ రాష్ట్రాల్లో కాలనీలో వెంటనే పరిష్కరించే అవకాశం ఉన్న చిన్న చిన్న సమస్యలను అధికారుల నిర్లక్ష్యం వైఖరితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు పట్టించుకుని అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తొలగించిన చెట్లకొమ్మలతో ఇబ్బందులు..

రామంతాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ బస్తీలు, కాలనీల్లో విడతల వారీగా రోజూ ఏదో ఒకచోట విద్యుత్ సరఫరా చేసే తీగలకు చెట్ల కొమ్మలు అడ్డుగా వస్తున్నాయని వాటిని పెద్దఎత్తున కత్తిరించి రోడ్లపైనే వేస్తున్నారు. గతనెల రోజుల క్రితం ఓల్డ్ రామంతాపూర్ చౌరస్తా వద్ద కత్తిరించిన చెట్ల కొమ్మలను రోడ్ల మీదే వదిలేయయడంతో దోమలు వ్యాప్తి అధికమై దీంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. వెంటనే చెట్ల కొమ్మల వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం..

ఓల్డ్ రామంతాపూర్ బొడ్రాయి వద్ద విద్యుత్ సరఫరా చేసే స్తంభం కేబుల్ వైర్లతో నిండిపోయి పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని, ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని తొలగించేలా ప్రజా ప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- రామంతాపూర్ నెహ్రూనగర్ ప్రధాన రహదారిలో రాధా దేవి అపార్టుమెంట్ ప్రహరీకి ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. చిన్నారుల చేతికందే ఎత్తులో దిమ్మపై దీనిని ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ.. కంచె లేకపోవడంతో పిల్లలు ఆడుకుంటూ.. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సబ్‌స్టేషన్‌లో ఉన్న ఫ్యూజ్ కాల్ సిబ్బందికి సమాచారం అందించేలా 9490153532 ఫోన్ నెంబరును ఏర్పాటు చేశారు. సదరు నంబరుకు ఫోన్ చేస్తే సిబ్బంది స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు.


ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇలా..

యమపాశాలుగా కేబుల్ వైర్లు..

రామంతాపూర్ పరిధిలోని విద్యుత్ స్తంభాలకు ఇంటర్నెట్ కేబుల్ వైర్లు, పిచ్చుక గూళ్లు చుట్టుకుని ఉన్నాయి. ఈ కేబుల్ వైర్లు సరైన పద్ధతుల్లో అమర్చితే ఎవరికీ ఏ ఇబ్బంది లేదు. యమపాశాలుగా కిందికి వేలాడుతూ వాహనదారుల మెడకు చుట్టుకుంటున్నాయి. ఈ కేబుల్ వైర్లతో పలుసార్లు విద్యుత్ వైర్లకు మంటలు అంటుకుని ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. విద్యుత్ సరఫరా చేసే స్తంభాల చుట్టూ బిగించిన కేబుల్ వైర్లు క్రమపద్ధతిలో ఉండేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలి..



రామంతాపూర్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిశీలించి ప్రజా ప్రతినిధులు పట్టించుకుని చొరవ తీసుకుని అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పరిష్కరించాలి. అధికారులు చూసి చూడనట్లుగా ఉంటే సమస్యలు మరింత జఠిలమయ్యే అవకాశం ఉంది.
– బుర్ర రాజేశ్వర్, ఓల్డ్ రామంతాపూర్


పిచ్చుక గూళ్లను తలపిస్తున్న కేబుల్ వైర్లు, శిథిలావస్థకు చేరిన విద్యుత్‌స్తంభం

ఘనంగా బోనాల ఘటం ఊరేగింపు


పోచమ్మ ఆలయంలో ఊరేగింపునకు సిద్ధమవుతున్న ఘటం

రామంతాపూర్ : మహంకాళి నల్లపోచమ్మ ఆలయంలో ఈనెల 28న నిర్వహించే బోనాల పండుగను పురస్కరించుకుని సంప్రదాయం ప్రకారం సోమవారం అమ్మవారి ఘటం ఊరేగింపు ప్రారంభమైంది. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్, ఆలయ అధ్యక్షుడు బుర్ర రాజేశ్వర్, డివిజన్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్‌యాదవ్, రాజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటలకు ఆహ్వానం



రామంతాపూర్ : వెంకట్‌రెడ్డినగర్‌లోని శ్రీ సాయిబాబా మందిరంలో ఈనెల 21న ఆదివారం సద్గురు సమర్థ సాయినాథ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే గురు పూర్ణిమ ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ.. ట్రస్ట్ సభ్యులు సోమవారం ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆలయ అధ్యక్షుడు మహదేవ భట్ల లక్ష్మణ్‌ప్రసాద్‌శర్మను ఎంపీ ఈటల ఘనంగా సన్మానించారు. సాయిబాబా ఆలయ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఆలయ ప్రతినిధులు భువనగిరి శ్రీనివాస్‌గుప్తా, గడ్డం సాయికిరణ్, హనుమంతరావు, యాదయ్య తదితరులున్నారు.

మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన


మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్

మౌలాలి : జీహెచ్ఎంసీ ఆదేశాలనుసారం సోమవారం మౌలాలి డివిజన్ ఓల్డ్ సఫిల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్‌యాదవ్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంక్షేమ సంఘాలు కూడా దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాత వస్తువులను తొలగించి, పూల కుండీల్లో నీటిని తీసివేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులు శ్రీనివాస్, వనజ, శ్రీనివాస్, భారతి, మనీషా, కృష్ణమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణితో సమస్యల పరిష్కారం


ప్రజావాణిలో విజ్ఞప్తులను స్వీకరిస్తున్న కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. సుమారు 14 దరఖాస్తులు అందాయని, మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చే సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించడమే ధ్యేయంగా తాము పనిచేస్తామని కమిషనర్ వివరించారు. డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, ఏఈ బిక్షపతి, టీపీఓ అలీపాషా తదితరులున్నారు.

మల్కాజిగిరి: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆస్తి పన్నులో పలు సమస్యలు ఉన్నాయని, మల్కాజిగిరిలోని ప్రైవేట్ భవనంలో ఉన్న గ్రంథాలయానికి శాశ్వతభవనం, నాలాల వద్ద భద్రతకు చర్యలు, విద్యుత్ సిబ్బంది తొలగించిన చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చినా వారి పేర్లు నమోదు చేయలేదని, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ అందడానికి తిరిగి నమోదు చేసుకోవాలని కోరామన్నారు.

మొదలైన బోనాల సందడి

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని మహంకాళి అమ్మవారి జాతర సందడి 15 రోజుల ముందుగానే మొదలైంది. దశాబ్దాల చరిత్ర గల అమ్మవారి బోనాల జాతర ఏటా సికింద్రాబాద్‌లోని అమ్మవారి జాతర మరుసటి ఆదివారం(ఈనెల 28వ తేదీ) జరుగుతుంది. ఆనవాయితీ అమ్మవారి ఘటం మల్కాజిగిరిలోని అన్ని ప్రాంతాల్లో రోజూ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి జాతరకు రాలేనివారు, వృద్ధులు అమ్మవారి ఘటానికి ఇంటి వద్దనే దర్శించుకుని పూజలు నిర్వహించడం అనవాయితీగా వస్తుందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ శ్రవణ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్‌గౌడ్, మంజులగౌడ్, రాధాకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారయత్నం కేసులో దర్యాప్తు వేగవంతం

అల్వాల్: మహిళపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో అల్వాల్ పోలీసులు విచారణను వేగవంతం చేశారు. శుక్రవారం రాత్రి అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తన భర్త వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు చేసి ఆటోలో తిరిగి వెళ్తున్న ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారని బాధిత మహిళ బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు అల్వాల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సీసీ పుటేజీ ఆధారంగా ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్ : వరంగల్ జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్నందున మంగళవారం 11 కేవీ ఉప్పల్ కాల్సా ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు ఏషియన్ థియేటర్, ఉప్పల్ ప్రధాన రహదారి, స్వరూప్‌రెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నిఖిల్ ప్రకటించారు.

అలరించిన నాటక ప్రదర్శన

మల్లాపూర్: రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మల్లాపూర్ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద సోమవారం మాడుగుల వెంకట కృష్ణమోహన్ రచించిన సుప్రభాతం 1231వ ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ నాటక ప్రదర్శన పలువురిని అలరించింది. ప్రముఖ రంగస్థలం నటులు ఐరేని రమేష్‌గౌడ్, చిలుక భాస్కర్, మాధవి, వెంకటేశ్వర్‌రావు, మాడుగుల రాధ, కళాభిమాని నాగమణి, యుగంధర్, చారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



కుషాయిగూడ: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో చర్లపల్లి సిల్వర్‌వోక్ బంగ్లాకు చెందిన విద్యార్థినులు విజయకేతనం ఎగురవేశారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో వారు కాంస్య పతకాలను సాధించి ప్రతిభ కనబరిచారు. అండర్ – 24 కేజీ లెవల్‌లో బబ్బూరి ఆదిత్య, అశ్వథ్‌వర్మ అంబటి అండర్– 50 కేజీ లెవల్‌లో బబ్బూరి లక్ష్మీస హస్ర, మానసవర్మ అంబటి కాంస్య పతకాలు సాధించగా.. వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు బబ్బూరి బాలరాజుగౌడ్ దంపతులు పాల్గొన్నారు.

తోపుడు బండిని కొనిస్తానని హామీ


మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్ : భారీ వర్షం కారణంగా నాచారం పోలీస్‌స్టేషన్ వెనుక ప్రహరీ కూలిన విషయం తెలిసిందే. గత 12 ఏళ్లుగా ప్రహరీ వద్ద నాచారం వీఎస్టీ కాలనీకి చెందిన సుజాత పూలు అమ్ముకుంటూ.. జీవనం కొనసాగిస్తోంది. గోడకూలి తోపుడు బండిపై పడటంతో పూర్తిగా ధ్వంసమైంది. విషయం తెలుకున్న నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని బాధిత మహిళతో మాట్లాడి, వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకుని వారికి కొత్త తోపు బండిని కొనిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

మురుగు సమస్యను పరిష్కరించండి


గోడౌన్ ఎదురుగా పారుతున్న మురుగు ఇలా..

మల్కాజిగిరి: మల్కాజిగిరి తాళ్లబస్తీలోని ఎంటమాలజి విభాగం గోడౌన్ ఎదురుగా గత కొంత కాలంగా యూజీడీ మ్యాన్‌హోల్ వద్ద మురుగు నిండి రోడ్డుపై ప్రవహిస్తుంది. అపరిశుభ్ర వాతావరణం ఉండటమే కాకుండా దుర్గంధమైన వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

కాప్రా: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాల ఉత్సవాలని ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేష్‌యాదవ్ తెలిపారు. ఆషాడమాసం బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించగా.. తెలంగాణ దశాబ్ది బోనాల ఉత్సవాల సందర్భంగా మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కాప్రా మండల తహసీల్దార్ సుచరిత, ఈఓ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, ప్రభుదాస్, శాంతి సాయిజెన్ శేఖర్ తదితరులున్నారు.

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని వాణీనగర్ విజయ వినాయకఆలయంలో మల్కాజిగిరి నియోజకవర్గంలోని 153 అమ్మవారి ఆలయాలకు బోనాల పండుగ చెక్కులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గం కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, రాజ్యలక్ష్మి, గున్నాల సునీతాయాదవ్, మీనా ఉపేందర్‌రెడ్డిలతో కలిసి ఆలయ నిర్వాహకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. గతేడాది రూ.55,22,000 పంపిణీ చేయగా.. ఈ ఏడాది రూ. 61,75,400లను మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం 10 శాతం నిధులను ఎక్కువగా పంపిణీ చేసిందని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు.

చర్లపల్లి ఐలా కమిషనర్‌గా ప్రభాకర్


ఐలా కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన జక్క రోషిరెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి ఇండస్ట్రీయల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) కమిషనర్‌గా ప్రభాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఐలా చైర్మన్ జక్క రోషిరెడ్డి పాలకవర్గం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్‌ను కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. అనంతరం చర్లపల్లి పారిశ్రామికవాడలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కమిషనర్‌తో సమీక్షించారు.

పరామర్శ


ఎమ్మెల్యే సత్యంను పరామర్శిస్తున్న అద్దంకి దయాకర్

అల్వాల్: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను సోమవారం కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ దంపతులు పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే సత్యం సతీమణి రూపాదేవి మృతి చెందడంతో అల్వాల్‌లోని ఆయన నివాసంలో కలిసి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. అల్వాల్ రైతుసేవా సహకార సంఘం మాజీ చైర్మన్ తోట దశమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ స్వాతికృష్ణాగౌడ్

మేడిపల్లి: మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం పీర్జాదిగూడ నగరపాలక పరిధిలో 2,5,7,13,14,15,21 డివిజన్లలో పలు కాలనీల పరిధిలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఈనెల 22వ తేదీ వరకు కొనసాగుతుందని, ప్రతి ఇంటికి మున్సిపల్ సిబ్బంది వచ్చి పూల మొక్కలు, పండ్ల మొక్కలను పంచుతారని వివరించారు. మున్సిపల్ సిబ్బంది, నగర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు


ఉప్పల్ బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్‌సీ హేమంత్ కేశవ్ పాటిల్

ఉప్పల్ : వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా ఉండేలా యుద్ధ ప్రాతిపదికన తగిన చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ జోనల్ కమిషన్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులకు సూచించారు. సోమవారం అధికారులతో కలిసి ఆయన ఉప్పల్‌లో పర్యటించారు. ఆదివారం కురిసిన వర్షాలకు ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఆయా ప్రాంతాల్లో వాటర్ లాగింగ్ అవ్వడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించారు. దాదాపు 2 గంటల పాటు కురిసిన భారీ వర్షానికి ఉప్పల్ పరిసర ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న జెడ్‌సీ సోమవారం ఉదయమే హుటాహుటిన ఉప్పల్‌కు చేరుకున్నాడు. జీహెచ్ఎంసి ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు, ఈఈ నాగేందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి, డీఈ నిఖిల్‌రెడ్డిలతో కలిసి పర్యటించారు. జోనల్ కమిషన్ ఈ ప్రాంతాన్ని సైతం సందర్శించి వరద నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉప్పల్ భగాయత్, మెట్రోస్టేషన్ వద్ద వాటర్ లాగింగ్ ప్రాంతాలను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన పనులను ప్రారంభించి వరద నీరు సజావుగా వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మౌలాలి : మౌలాలి డివిజన్ పరిధిలోని దీన్‌దయాల్ నగర్ నాలాలో చాలా కాలంగా పూడికతీయకుండా ఉండటంతో భారీ వర్షాలకు ఇళ్లల్లోకి మురుగు చేరుతుండటంతో రోడ్లన్నీ జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వెంటనే స్పందించి అధికారులను అప్రమత్తం చేశారు. పూడికతీత పనులను అధికారులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. డీఈ మహేష్, ఏఈ మధురిమ, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు


కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్

కాప్రా : భక్తుల సౌకర్యార్థం కుషాయిగూడ డిపో ఆధ్వర్యంలో అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ చంద్రకాంత్ ప్రకటించారు. ఈ బస్సులు నాగారం నుంచి అరుణాచలానికి నడుపనున్నట్లు వివరించారు.ఈనెల 19న శుక్రవారం సాయంత్రం 7 గంటలకు నాగారం నుంచి బయలుదేరి ఈసీఐఎల్, నేరేడ్మెట్, మల్కాజ్‌గిరి, తార్నాక, ఎంజీబీఎస్ చేరుకుని అక్కడి నుంచి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందన్నారు. తిరిగి ఈనెల 21న సాయంత్రం అరుణాచలం నుంచి బయలుదేరి ఈనెల 22న ఈసీఐఎల్‌కు చేరుకుంటుందని చెప్పారు. ఈ ప్రత్యేక సర్వీసులో టిక్కెట్ ధర ఒక్కరికి రూ.3,790గా నిర్ధారించినట్లు తెలిపారు. టికెట్ బుకింగ్ కోసం ఈసీఐఎల్ బస్ టెర్మినల్, నెరేడ్‌మెట్, నాగారం, మల్కాజ్‌గిరిలోని ఏటీబీ ఏజెంట్ కౌంటర్లను సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చని సూచించారు.

ఫిర్యాదుపై అలసత్వం !

మల్కాజిగిరి: తన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదులో అలసత్వం వహించారని భాదితురాలు ఆరోపణలు చేసింది. ఈస్ట్ ఆనంద్‌బాగ్ తరుణి ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న సుజాత కుటుంబానికి ఎదురింట్లో ఉంటున్న తేజ కుటుంబసభ్యులకు ఈనెల 10న కారు పార్కింగ్ విషయంలో గొడవ జరిగింది. ఆ సమయంలో అసభ్య పదజాలంతో పాటు చంపుతామని బెదిరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆత్మహత్యాయత్నం చేయడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు.

ఆరోపణలు అవాస్తవం : సీఐ సత్యనారాయణ

బాధితురాలి ఆరోపణల్లో వాస్తవం లేదని, ఫిర్యాదు అందిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి విచారించామన్నారు. పిటిషన్ తీసుకొని రశీదు అందజేశామన్నారు. ఎఫ్ఐఆర్‌కు కోర్టు అనుమతి కోరామన్నారు. ఈనెల 14న బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వివరణ ఇచ్చారు. ప్రస్తుతం మారిన చట్టాల ప్రకారం ఆలస్యం చేయడానికి తావే లేదన్నారు.

డ్రగ్స్ కేసులో కుమారుడు పట్టుపడ్డాడని..

రూ.50వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

అల్వాల్: కొడుకు తిరుపతి దైవదర్శనానికి వెళ్లిన సమయంలో ఆగంతకులు తండ్రికి ఫోన్‌చేసి మీ కుమారుడు డ్రగ్స్ కేసులో పట్టుబడ్డాడంటూ.. బెదిరించి డబ్బులు కాజేసిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారంలో నివసించే మధుసూదన్ ఆర్టీసీ ఉద్యోగి. కాగా భార్య మాధవి, కుమారుడు రాహుల్‌తో ఉంటున్నారు. రాహుల్ ఈనెల 12న తిరుపతికి వెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం దుండగులు ఫోన్‌చేసి ' మీ కుమారుడు తిరుపతిలో డ్రగ్స్ కేసులో పట్టుబడ్డాడని అరెస్ట్ చేసి ఢిల్లీకి తీసుకెళ్తున్నామని' బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో డబ్బులు పంపించాలంటూ డిమాండ్ చేయగా.. మొదటగా రూ.50 వేలు ఆన్‌లైన్‌లో పంపాడు. అనంతరం మరో రూ.లక్ష పంపాలని ఒత్తిడి చేశాడు. బ్యాంకుకు వెళ్లగా.. తెలిసిన వారు మోసపూరితంగా ఉందని, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అదే సమయంలో కొడుకు రాహుల్ నుంచి ఫోన్ రాగా.. 'తాను ఈరోజు (సోమవారం) దైవ దర్శనానికి వెళ్లానని, ఈ సమయంలో ఫోన్ లాకర్‌లో పెట్టడంతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేయాల్సి వచ్చిందని' తండ్రికి చెప్పాడు. దీంతో బాధితుడు అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.